# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 30-05-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ ఓట్ల లెక్కింపు సమయంలో కౌంటింగ్ కేంద్రాల వద్ద శాంతి భద్రతలకు విఘాతం కలిగించిన వారిని తక్షణమే అరెస్టు చేస్తామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా హెచ్చరించారు.

- ❖ సార్వత్రిక ఎన్నికలు 2024లో భాగంగా ఆఖరి విడత ఎన్నికల ప్రచారం ఈ రోజుతో ముగిసింది.

- ❖ ఏపీ ఐసెట్, ఏపీ ఈసెట్ - 2024 పరీక్షా ఫలితాలను రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఈ రోజు విడుదల చేసింది.

- ❖ రాబోయే నాలుగైదు రోజుల్లో నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించే అవకాశం ఉందని భారత వాతావరణ కేంద్రం తెలియజేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = =

సార్వత్రిక ఎన్నికలు 2024లో భాగంగా ఆఖరి విడత ఎన్నికల ప్రచారం ఈరోజుతో ముగిసింది. ఏడు రాష్ట్రాలు ఒక కేంద్ర పాలిత ప్రాంతంతో కలిపి మొత్తం 57 లోక్ సభ స్థానాలకు జూన్ 1వ తేదీన పోలింగ్ జరగనుంది. ఇదిలా ఉండగా భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, ప్రధానమంత్రి నరేంద్రమోదీ సార్వత్రిక ఎన్నికల ప్రచారాన్ని పంజాబ్‌లోని హోషియార్‌పుర్ లో ఎన్నికల ర్యాలీతో ముగించారు. అనంతరం ఆయన కన్యాకుమారికి వెళ్లి అక్కడ ఉన్న వివేకానందుని స్మారకం వద్ద ధ్యానం చేయనున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

కృష్ణా జిల్లాలో జూన్ 4న జరగనున్న ఓట్ల లెక్కింపుకు చేసిన ఏర్పాట్లన్నీ సంతృప్తికరంగా ఉన్నాయని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా పేర్కొన్నారు. ఈరోజు ఆయన ఓట్ల లెక్కింపు కేంద్రమైన కృష్ణ విశ్వవిద్యాలయాన్ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డీకే బాలాజీ, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మీలతో కలిసి పరిశీలించారు. అనంతరం పాత్రికేయుల మాట్లాడుతూ, ఓట్ల లెక్కింపు రోజున ఎవరైనా కౌంటింగ్ కేంద్రంలో అలజడి సృష్టిస్తే తక్షణమే వారిని అరెస్టు

చేస్తామని హెచ్చరించారు. కౌంటింగ్ కేంద్రం వెలుపల కూడా సైతం 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, నిబంధనలను అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలుపుతూ...

(వాయిస్ 21 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలో జూన్ 1వ తేదీన పింఛన్లను విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న కారణంగా ఈ నెలలో అనురించ విధానంలోనే... జూన్ నెల పింఛన్ల కూడా అందజేయనున్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే ప్రభుత్వం 1,939 కోట్ల రూపాయలను విడుదల చేసింది. జూన్ ఒకటో తేదీన డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్ (డీబీటీ) ద్వారా 47 లక్షల 74 వేల 533 మందికి పింఛన్లు పంపిణీ చేయనున్నారు. బ్యాంకు అకౌంట్లు లేని 17 లక్షల 56 వేల 105 మందికి జూన్ 1వ తేదీ నుంచి 5వ తేదీ మధ్యలో ఇంటి వద్దే పింఛన్ పంపిణీ చేయనున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రకాశంజిల్లా యర్రగొండపాలెం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి డాక్టర్ శ్రీలేఖను విదుల నుంచి తొలగిస్తూ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముకేష్ మీనా కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 13న జరిగిన పోలింగ్ సందర్భంగా యర్రగొండపాలెం నియోజకవర్గంలో ఘర్షణలు జరిగిన సమయంలో సకాలంలో స్పందించకపోవడంతో ఎన్నికల సంఘం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ముకేశ్ మీనా కుమార్ వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఈరోజు తిరుపతిలో పర్యటించనున్నారు. ఈ రోజుతో ఎన్నికల ప్రచారం పూర్తి కావడంతో సాయంత్రానికి తిరుమలకు చేరుకుంటారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. రేపు ఉదయం తిరుమలలోని శ్రీవెంకటేశ్వరస్వామిని కుటుంబ సమేతంగా దర్శించుకోనున్నారు. అమిత్ షా పర్యటన నేపథ్యంలో తిరుమలలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లను చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

తిరుమలలో రద్దీని దృష్టిలో ఉంచుకుని వయో వృద్ధుల కోసం రెండు ప్రత్యేక దర్శన స్లాట్లను ఏర్పాటు చేశామని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఒక ప్రకటనలో తెలియజేసింది. ఉదయం 10 గంటలకు, మధ్యాహ్నం 3 గంటలకు రెండు స్లాట్లలో వయో వృద్ధులు నేరుగా స్వామి వారిని దర్శించుకోవచ్చునని పేర్కొంది. దీని కోసం వయో వృద్ధులు ఫోటో గుర్తింపు కార్డుతో ఉన్న వయస్సు రుజువును S1 కౌంటర్‌లో సమర్పించాలని తెలిపింది. ఈ దర్శన సమయంలో ఇతర క్యూ లైన్లను నిలిపివేస్తామని టీటీడీ వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

జంతువుల అక్రమ రవాణా, జంతు వధ నియంత్రణకు రాష్ట్ర, జిల్లా స్థాయిలో నోడలు అధికారులను నియమిస్తూ రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా ఈరోజు ఉత్తర్వులు జారీ చేశారు. అక్రమ జంతు రవాణా, జంతువధల నియంత్రణ పర్యవేక్షణకు రాష్ట్ర స్థాయిలో అసిస్టెంట్ ఇన్ స్పెక్టర్ జనరల్ (శాంతి భద్రతలు) నోడలు అధికారిగా యం.రవీంద్రనాధ్ బాబును నియమించారు. అలాగే జిల్లా స్థాయి నోడలు అధికారులుగా అదనపు ఎస్పి, డిఎస్పి స్థాయిలో నోడలు అధికారులను నియమించారు. వీరు జంతువుల అక్రమ రవాణా, జంతువధలపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచి, జిల్లాల్లో ఆయా శాఖల సమన్వయంతో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని డిజిపి హరీశ్ కుమార్ గుప్త ఆదేశించారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = =

సత్రగంజిలో ఈరోజు రాత్రి 11 గంటల 40 నిమిషాలకు బయలుదేరాల్సిన సత్రగంజి- తాంబరం ప్రత్యేక రైలు 3 గంటల 30 నిమిషాలు ఆలస్యంగా, అనగా ఈరోజు అర్ధరాత్రి మూడు గంటల పది నిమిషాలకు బయలుదేరుతున్నట్లు రైల్వే అధికార వర్గాలు ఒక ప్రకటనలో వెల్లడించాయి. దీని జత రైలు ఆలస్యంగా నడుస్తున్న కారణంగా ఈ మార్పు చేసినట్లు తెలిపాయి.

= = = = = = = = = = = = = = = = = = = = =

ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఏపీ ఐసెట్-2024 ఫలితాలు (AP ICET) ఈరోజు విడుదలయ్యాయి. ఈ పరీక్షలో 96.71 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ హేమచంద్రారెడ్డి వెల్లడించారు. కాగా డిప్లమా విద్యార్థులు ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరంలోకి ప్రవేశాల కోసం నిర్వహింహించే ఏపీ ఈసెట్ పరీక్షా ఫలితాలను హేమచంద్రారెడ్డి అనంతపురం జవహర్ లాల్ నెహ్రు టెక్నాలజీ యూనివర్సిటీ వైస్ ఛాన్సిలర్ జీవీఆర్ శ్రీనివాస్ రావుతో కలిసి ఈరోజు ఉదయం విడుదల చేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా నిర్వహించిన ఏపీ ఈసెట్ పరీక్షలో అత్యధికంగా బాలికలు 93.65 శాతం ఉత్తీర్ణత సాధించగా, బాలురు 89.35 శాతం ఉత్తీర్ణత సాధించారని కె.హేమచంద్రారెడ్డి వివరిస్తూ......

(వాయిస్ 23 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

వెస్టర్న్ నేవల్ కమాండ్ ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్, వైస్ అడ్మిరల్ సంజయ్ జె సింగ్ మూడు రోజుల విశాఖ పర్యటన ఈరోజుతో పూర్తయ్యింది. విశాఖపట్నంలోని తూర్పు నౌకాదళ కమాండ్‌ను ఆయన సతీసమేతంగా ఈనెల 28న సందర్శించారు. ఈ పర్యటనలో ఈస్టర్న్ నావల్ కమాండ్, ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్‌తో కలిసి పలు విషయాలపై ఆయన చర్చించారు. విశాఖపట్నంలోని నేవల్ డాక్‌యార్డ్, మెటీరియల్ ఆర్గనైజేషన్, INS ఏక శిల, INS విశ్వకర్మ వద్ద ఉన్న సబ్‌మెరైన్ డ్యామేజ్ కంట్రోల్, ఫైర్ ఫైటింగ్ ఫెసిలిటీ (రక్షక్) వంటి అనేక ప్రదేశాలను సందర్శించారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

చిత్తూరు జిల్లాలో బాల కార్మికులు ఉండకూడదని జిల్లా రెవిన్యూ అధికారి బి.పుల్లయ్య పేర్కొన్నారు. బాల కార్మికుల నిర్మూలనకు ఈరోజు చిత్తూరులో నిర్వహించిన జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ, బాల కార్మికులను నిర్మూలించడానికి జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సభ్యులు సమన్వయంతో పని చేయాలన్నారు. నేటి బాలలే.. రేపటి పౌరులని.. 14 సంవత్సరాలలోపు పిల్లలు అందరూ బడిలో ఉండాలని, పనిలో కాదని ఆయన అన్నారు. జూన్ 1 నుండి 30వ తేదీ వరకు జిల్లాలో బాల కార్మికుల నిర్మూలనకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

నైరుతి రుతు పవనాలు వేగంగా విస్తరిస్తున్నాయని, ఈ రోజు ఉదయం అవి కేరళను తాకాయని భారత వాతావరణ కేంద్రం (IMD) వెల్లడించింది. లక్షద్వీప్, కేరళలోని కొన్ని ప్రాంతాలకు రుతుపవనాలు విస్తరించేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని తెలిపింది. రాబోయే నాలుగైదు రోజుల్లో రుతుపవనాలు ఆంధ్రప్రదేశ్ లోకి ప్రవేశించే అవకాశం ఉందని పేర్కొంది. వారం ముందుగానే రుతుపవనాలు పురోగమిస్తుండడంతో ఈ వర్షాకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించింది. మరోవైపు రాష్ట్రంలో పలుచోట్ల 42 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, రానున్న ఒకటి, రెండు రోజుల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలియజేశారు.

======================

అగ్నిబాణ్ రాకెట్ ప్రయోగం విజయవంతమైంది. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి ప్రైవేట్ రాకెట్ అగ్నిబాణ్ విజయవంతంగా నింగిలోకి వెళ్ళింది. ప్రైవేట్ రాకెట్ ని ప్రయోగ వేదికపై నుంచి ఉదయం 7 గంటల 15 నిమిషాలకు ఈ రాకెట్ ప్రయోగించారు. ఈ ప్రయోగం విజయంతో ప్రైవేటు రాకెట్ ప్రయోగాల పరంపర మొదలైందని ఇస్రో అధికారులు తెలిపారు. భవిష్యత్ లో 300 కిలోల లోపు చిన్న తరహా ఉపగ్రహాలను లోఎర్త్ ఆర్బిట్‌లో ప్రవేశపెట్టడానికి ఇస్రో ఈ తరహా ప్రయోగం చేపట్టింది. కాగా, ఐఐటీ మద్రాస్ స్టార్టప్ అగ్నికుల్ కాస్మోస్ ఈ రాకెట్‌ను రూపొందించింది.

======================

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ కు వంశధార ప్రాజెక్ట్ పరిధిలో కుడి ఎడమ కాలువల ద్వారా రెండు లక్షల 50 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టామని వంశధార ప్రాజెక్టు పర్యవేక్షణ ఇంజినీర్ డోల తిరుమల రావు తెలిపారు. ఈరోజు శ్రీకాకుళంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... 2024-25 ఖరీఫ్ సీజన్ కు సంబంధించి... ముందస్తు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. వంశ ధార రెండవ దశ నిర్మాణ పనులు 98 శాతం పూర్తి అయ్యాయని ఆయన తెలియజేశారు. వర్షాకాలంలో సముద్రంలోకి వృధాగా పోతున్న జలాలను హిరమండలం రిజర్వాయర్ లోకి మళ్లిస్తామని తిరుమల రావు స్పష్టం చేశారు.

======================
======================